క్లుప్తంగా

నేడు డబుల్ ఇళ్ల సముదాయం వద్ద బీజేపీ దీక్ష

నిజాంపేట్: తొమ్మిదేళ్లుగా పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు దీక్ష చేపట్టనున్నారు. దేవేందర్‌నగర్‌లోని డబుల్‌బెడ్‌రూమ్ గృహ సముదాయం వద్ద దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షను జయప్రదం చేయాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లో పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం ఇంటింటికి వెళ్లి కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బండల వెంకటేశ్, యాదయ్య, బీరప్ప, వినోద్‌కుమార్, వెంకటేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ పాదయాత్ర

జగద్గిరిగుట్ట: పేదల దగ్గర పన్నుతో దోచి పెద్దలకు లోన్లు మాఫీ చేస్తున్న బీజేపీని నమ్మొద్దని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం అన్నారు. సీపీఐ చేపట్టిన ఇంటింటికీ పాదయాత్రలో గురువారం 2వ రోజు డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప, కూనా మహలక్ష్మీ నగర్, షిరిడీ హిల్స్, మైసమ్మ నగరలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్, దుర్గయ్య, సదానంద్, శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



జగద్గిరిగుట్ట: గాజులరామారం సర్కిల్ పరిధిలోని లెనిన్‌నగర్ రోడ్ నం.27లో డ్రైనేజీ నిత్యం పొంగిపొర్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ పొంగిన ప్రతిసారి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారని.. శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు చెబుతున్నారు. తీవ్రమైన దుర్వాసనతో రోడ్డుపై నడవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత తొందరగా తమ సమస్యకు పరిష్కరం చూపాలని కోరారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి


జగద్గిరిగుట్ట: భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. షిరిడీహిల్స్‌లోని సగర సంఘం కార్యాలయంలో ఉన్న భగీరథ మహర్షి విగ్రహానికి కార్పొరేటర్ జగన్ పూలమాలలు వేశారు. ఈ జయంతిలో స్థానికులు, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నిజాంపేట్: చలివేంద్రాల ఏర్పాటుతో పాదచారుల దాహార్తి తీరుతుందని నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి కార్పొరేటర్ కాసాని సుధాకర్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కమ్మెట భూపాల్ తన తాతా నాయినమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

ట్రాఫిక్ డైవర్షన్

నేటి నుంచి మే 28 వరకు మళ్లింపు



జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు విడుదల చేసిన రూట్‌మ్యాప్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి చింతల్ మార్కెట్ వద్ద నూతనంగా చేపడుతున్న ట్విన్ బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 28 నుంచి మే 28వ తేదీ వరకు కల్వర్టు పనులకు ఆటంకం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందన్నారు. వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు.

- చింతల్ ప్రధాన రోడ్డు నుంచి పద్మానగర్ రింగ్‌రోడ్డుకు వెళ్లే వాహనదారులను ఎల్లమ్మ ఆలయం పక్కగా వాణినగర్, కుత్బుల్లాపూర్ గ్రామాల మీదుగా..
- పద్మానగర్ రింగ్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలను మాణిక్యనగర్ కమాన్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కేఎం పాండు విగ్రహం మీదుగా చింతల్ ప్రధాన రోడ్డుకు..
- పద్మానగర్ రింగ్ రోడ్డు మీదుగా ఫైన్ చికెన్ మార్కెట్, అంబేడ్కర్ నగర్ రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం, రామిరెడ్డి నగర్, రెయిన్‌బో హైస్కూల్ నుంచి ఐడీపీఎల్ ప్రధాన రోడ్డుకు మళ్లిస్తున్నారు.

మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్



సూర్యానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్యానగర్‌లో మాజీ కార్పొరేటర్ గౌరీష్‌తో కలిసి ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచామన్నారు. ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తున్నామని తెలిపారు. మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్‌చారి, నార్లకంటి బాలయ్య, మధుకర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- సుభాష్‌నగర్ ఫాక్స్ సాగర్ సమీపంలోని శ్రీగణేష శివనాగేశ్వర సహిత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ గడప ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, అడప శేషు, పద్మజా రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ప్రకాష్ గుప్తా, అశోక్‌గుప్తా, రామ్మోహన్, రాజు, శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సర్వ సాధారణం

- ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డికి వీడ్కోలు పలికిన సిబ్బంది
- నూతన ఇన్‌స్పెక్టర్‌గా రామకృష్ణ బాధ్యతలు



సీఐ రమణారెడ్డితో మహిళా సిబ్బంది



నూతన సీఐ రామకృష్ణ

దుండిగల్: దుండిగల్ ఇన్‌స్పెక్టర్ పి.రమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను సైబరాబాద్ క్రైం వింగ్‌కు అటాచ్ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.రామకృష్ణను నియమించారు. కాగా రమణారెడ్డిని గురువారం దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. స్టేషన్ లోపలి నుంచి వెలుపలి వరకు పూలు చల్లుతు తమ అభిమాన్ని చాటుకున్నారు. అనంతరం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి రమణారెడ్డితో తమకున్న అనుబంధాన్ని వెలబుచ్చారు. సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బదిలీలు సర్వ సాధారణమని అన్నారు. రెండేళ్లకు పైగా సిబ్బంది తనకు పూర్తి సహాయ సహకారులు అందించారని వారికి కృతజ్ఞుడిగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, దుండిగల్ డీఐ కృష్ణప్రసాద్, ఎస్సైలు శ్రీనివాస్, సర్దార్ నాయక్, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, రాములు, రాజేశ్, కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మాక్‌డ్రిల్ @ రంగా థియేటర్



థియేటర్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ సుభాష్‌రెడ్డి

జీడిమెట్ల: అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి అన్నారు. జీడిమెట్లలోని రంగా థియేటర్‌లో గురువారం జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ఎలా ఎదుర్కోవాలి? మంటలను ఆర్పేందుకు ఎలాంటి వస్తువులను వాడాలో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. అనంతరం థియేటర్ సిబ్బంది అడిగిన పలు ప్రశ్నలకు వారు జవాబులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ఫైర్ సిబ్బంది, రంగా థియేటర్ మేనేజ్‌మెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ



చిన్నారులకు ఆధార్ నమోదు చేయిస్తున్న తల్లిదండ్రులు

రంగారెడ్డినగర్: డివిజన్‌లోని ఆదర్శ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో 6ఏళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం పోస్టల్ శాఖ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రతినిధి కృష్ణ పలువురు చిన్నారులకు ఆధార్ నమోదును చేశారు. అంగన్‌వాడీ టీచర్లు శిల్ప, జ్యోతి, సుజాత తదితరులు చిన్నారుల తల్లిదండ్రుల నుంచి ఆధార్ కార్డులతో పాటు నివాస పత్రాలు, ఇతర సమాచారాన్ని సేకరించి ఆధార్ ప్రకియ సజావుగా కొనసాగేలా సహకరించారు.

క్రికెట్ కిట్ల అందజేత

జగద్గిరిగుట్ట: మగ్దూంనగర్‌లో బీఆర్ఎస్ యూత్ నాయకులు జైహింద్ చేతుల మీదుగా క్రీడాకారులు క్రికెట్ కిట్‌లు అందజేశారు. జీహెచ్ఎంసీ వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనాలన్నారు. మానసిక ఉల్లాసానికి వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

సాయిఅనురాగ్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సాయిఅనురాగ్ కాలనీలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేయాలని, కాలనీలో వరదనీరు నిలవకుండా డ్రెయిన్‌ను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కాలనీ ప్రెసిడెంట్ జనార్దన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి కిరణ్, కోశాధికారి భాస్కర్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులకు భూమిపూజ చేస్తున్న దుండిగల్ వైస్‌చైర్మన్ పద్మారావు

సుభాష్‌నగర్: ప్రతి ఇంటికి తాగునీటిని అందివడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు అన్నారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని 14వ వార్డు కార్తికేయనగర్‌లో రూ.25లక్షలతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ పనులను చేపట్టారు. గురువారం ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీలైనంత త్వరగా ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా అవుతుందన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు



నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలోని సాయినగర్‌కాలనీలో గుంతలుగా మారిన రోడ్లకు గురువారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రజల నుంచి కార్పొరేటర్ కాసాని శిరీషకు ఫిర్యాదులు అందడంతో ఆమె కాంక్రీట్ వేయించి గుంతలను పూడ్చివేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్లు

నిజాంపేట్: నిజాంపేట్ కొలన్ నారాయణరెడ్డి కాలనీలోని శ్రీసంతోషి మాత ఆలయ 16వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అఖండ దీపారాధన, గణపతి గౌరీ పూజ, శిఖర పూజ, అమ్మవారికి క్షీరాభిషేకం, నవగ్రహ అష్టదిక్పాలకు పూజ, స్వస్తి పుణ్యహవాచనం, ప్రధాన కలశ పూజ, సంతోషి మాత హోమం ప్రత్యేక చెక్కరభిషేకం, మహా నైవేద్యం సమర్పించారు. నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ప్రారంభించారు. కార్పొరేటర్లు ఆవుల పావని, రాజేశ్వరీ, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సబిత, భక్తులు పాల్గొన్నారు.

- ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో మే 3, 4, 5 తేదీల్లో పంచముఖ ఆంజనేయస్వామి, నవగ్రహ, నాగ సుబ్రహ్మణ్య, ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. గురువారం ఆలయకమిటీ సభ్యులు మేయర్ నీలారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ చేతుల మీదుగా ఆలయ గోపుర కలశాన్ని బీఆర్ఎస్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

హమాలీల సంక్షేమానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి



చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కుత్బుల్లాపూర్: హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని మేడ్చల్ జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి బీరప్ప అన్నారు. ఈ నెల 29న సీఐటీయూ ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్'ను గురువారం జీడిమెట్లలోని హమాలీ యూనియన్ అడ్డా వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు పది లక్షల మంది కార్మికులు హమాలీలుగా పనిచేస్తున్నారని అన్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

- 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రభుత్వంతో సంబంధం ఉన్న వాటిలో పనిచేసే హమాలీలను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వారికి కనీస వేతనం, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. చలో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున హమాలీలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జీడిమెట్ల హమాలీ సంఘం ప్రధాన కార్యదర్శి దేవదానం, హమాలీ సంఘం నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, బాలయ్య, పాషా, సునీల్, దుర్గా నాయక్, బీరయ్య, నర్సింహులు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న కౌన్సిలర్ అనంతస్వామి

దుండిగల్: నిరుపేద ఆడబిడ్డ వివాహానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆపన్న హస్తం అందించారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట 24వ వార్డులో నివసించే శైలజ తన భర్త కొన్ని సంవత్సరాల క్రితం చనిపోవడంతో కుటుంబాన్ని పోషిస్తోంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో తన కుమార్తె నవ్య వివాహం చేయడం భారంగా మారింది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ అర్కల అనంతస్వామి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.50వేలను ఆర్థిక సహాయం అందజేశారు. దానికి అనంతస్వామి రూ.10వేలు కలిపి మొత్తం రూ.60 వేల నగదును గురువారం యువతి తల్లి శైలజకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు గండిగూడెం రమేశ్‌ముదిరాజ్, కొండ కోటేశ్, గండిగూడెం గోపాల్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలి



గాంధీభవన్‌లో జరిగిన దీక్షలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని పార్లమెంట్ సభ్యుడిగా తొలగించినందుకు గురువారం రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సంఘటన్ జాతీయ అధ్యక్షులు మీనాక్షీ నటరాజన్ హాజరై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని వెంటనే పునరుద్ధరించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు.. చెట్ల తొలగింపు



చెట్లు తొలగించే వాటికి మార్కింగ్ వేస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

సుభాష్‌నగర్: నగర శివారు ప్రాంతమైన గండి మైసమ్మ, మియాపూర్ రోడ్డును విస్తరణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. మియాపూర్ నుంచి గండి మైసమ్మ వరకు 12 కిలోమీటర్ల పొడవు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. అందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ఎన్ని చెట్లను తొలగిస్తున్నారు. ఈ పనులు స్థానిక ఫారెస్ట్ సెక్షన్ ఆఫీస్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ కారణంగా 500 చెట్లను తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

అన్ని వార్డుల్లో కంటి వెలుగు కేంద్రాలు



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. మున్సిపాలిటీ పరిధి గాగిల్లాపూర్ తాండా 27వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శంకర్, భరత్‌కుమార్, నేతలు రమేశ్, మోహన్, భీంసింగ్, ప్రవిణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థాల డంపింగ్



దుండిగల్: అక్కడ కెమికల్ రసాయనాల డంపింగ్ పరిపాటిగా మారింది. పరిశ్రమల నుంచి వస్తున్న ఘాటైన వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి తోడు రసాయనాల డంపింగ్ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్ తాండా, దుండిగల్ తాండా-1, 2 ప్రాంతాల్లో ఇష్టానుసారంగా రసాయన వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. బుధవారం రాత్రి సైతం గుర్తుతెలియని వ్యక్తులు డంపింగ్‌యార్డు పక్కన ఉన్న గొయ్యిలో ట్యాంకర్లతో కెమికల్ వ్యర్థాలను పారబోశారు. ఇప్పటికే ఖాజిపల్లి, బొల్లారం, జిన్నారం ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలతో సతమతం అవుతతున్నారు. ఇప్పుడు ఏకంగా జనావాసాల మధ్యే వ్యర్థాలను పారబోస్తుండటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ట్యాంకర్ల వ్యాపారాలు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు డంపింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు స్పందించారు..

సాక్షి ఎఫెక్ట్..

రంగారెడ్డినగర్: నెల రోజులుగా వాహనదారులు పడ్డ ఇబ్బంది ఎట్టకేలకు పరిష్కారానికి నోచుకుంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో ఇటీవల నూతనంగా సీసీరోడ్డు పనులు చేపట్టి పూర్తి చేశారు. అయితే పనుల్లో భాగంగా కాలనీ ఎంట్రన్స్‌లో డ్రైనేజీ పైపులైన్ శ్లాబ్ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఈ విషయమై ఈనెల 17న సాక్షిలో 'డ్రైనేజీ పైపులైన్‌పై శ్లాబ్ లేదు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్కిల్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో ఆ ప్రాంతంలో శ్లాబ్ వేయించారు. సమీపంలోని మ్యాన్‌హోళ్లపై మూతలు ఏర్పాటు చేయించి రాకపోకలకు అనువుగా రోడ్డును తీర్చిదిద్దారు. దీంతో విజయ్‌నగర్ కాలనీవాసులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు



నేడు

ఇలాగే వదిలేస్తే.. శ్లాబ్ ధ్వంసమవుతుంది..



భగత్‌సింగ్‌నగర్ - మారుతీనగర్ మధ్య నాలా శ్లాబ్‌పై వస్తు సామగ్రి

రంగారెడ్డినగర్: నాలా శ్లాబ్‌లు అక్రమ పార్కింగ్‌కు.. వస్తు సామగ్రి పెట్టుకునే అడ్డాలుగా మారుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ సరిహద్దులోని భగత్‌సింగ్‌నగర్ - మారుతీనగర్ మధ్య మురుగు, వరదనీరు వెళ్లేందుకు వీలుగా నాలా ఉంది. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు నాలాపై సర్కిల్ అధికారులు శ్లాబ్‌ను ఏర్పాటు చేశారు. అయితే నాలాకు అటు ఇటుగా ఉంటున్న కొందరు శ్లాబ్‌పై వస్తు సామగ్రిని ఉంచుతున్నారు. అంతే కాకుండా కొందరు ఇనుప తయారు సామగ్రిని నాలా శ్లాబ్‌పై ఉంచి పనులు చేపడుతున్నారు. దీంతో శ్లాబ్ నాణ్యత దెబ్బతిని శిథిలమయ్యే అవకాశముంది. అధికారులు ఇప్పటికైనా నాలా శ్లాబ్‌పై వస్తుసామగ్రిని ఉంచకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029